# 'డబుల్' ఆనందం..



నాడు అధ్వానంగా తయారైన సింగిల్ బీటీరోడ్డు

నార్నూర్, నవంబర్ 3: మండల కేంద్రం నుంచి ఉమ్రి ఎక్స్‌రోడ్డు వరకు గతంలో సరైన రోడ్డు లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సింగిల్ రోడ్డు గుంతలమయంగా మారింది. ప్రజలు అష్టకష్టాలు పడుతూ ప్రయాణించారు. గత పాలకులు విన్నవించినా పట్టించుకున్న పాపన పోలేదు. రాష్ట్రం అధికారంలోకి వచ్చాక నార్నూర్ కేంద్రం నుంచి ఉమ్రి ఎక్స్‌రోడ్డు దాకా డబ్బుల్ బీటీరోడ్డు నిర్మాణానికి 2017లో రూ.16 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో మండల కేంద్రం నుంచి మాల్కుగూడ గ్రామ సమీపం వరకూ 7కిలో మీటర్లు డబుల్ రోడ్డును నిర్మించింది. సింగిల్‌రోడ్డుకు బదులు డబుల్‌రోడ్డు నిర్మాణంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం డబుల్‌రోడ్డుపై ప్రయాణం సాఫీగా కొనసాగుతున్నది.



నేడు మండల కేంద్రం నుంచి వేసిన డబుల్ బీటీరోడ్డు

# సాగునీటి గోసకు 'చెక్'

## ఆదిలాబాద్ జిల్లాలో 47 చెక్‌డ్యాంల నిర్మాణం

- 8890 ఎకరాల ఆయకట్టు
- పెరిగిన భూగర్భ జలాలు
- రెండు పంటలకు ఢోకా లేకపోవడంతో రైతుల ఆనందం



ముక్రా(కే)లో శనగ పంటకు చెక్‌డ్యాం ద్వారా నీటిని అందిస్తున్న రైతు

**ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి వనరుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో రైతులు వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేసేవారు. వరుణుడు కరుణిస్తే పంట.. లేదంటే తంటా అన్నట్లు పరిస్థితి ఉండేది. స్వరాష్ట్రంలో ప్రభుత్వం రెండు పంటలకు సాగు నీరందిస్తున్నది. ఇందులో భాగంగా జిల్లాలో ఇప్పటికే ప్రాజెక్టులు, చెరువుల నిర్మించింది. జిల్లాలో 47 చెక్‌డ్యాంలను నిర్మించింది. ఒక్కో చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.2 కోట్ల నుంచి రూ.2.50 కోట్ల చొప్పన రూ.126.48 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ క్రమంలో 8819 ఎకరాలకు సాగనీరు అందడంతో పాటు భూగర్భ జలాలు పెరిగాయి.**

*- ఆదిలాబాద్, నవంబరు 3 (నమస్తే తెలంగాణ)*

ఉమ్మడి రాష్ట్రంలో రైతుల పరిస్థితి అధ్వానంగా ఉండేది. జిల్లాలో రైతులు వానకాలంలో 5 లక్షల ఎకరాల్లో పత్తి, కంది, సోయాబిన్, ఇతర పంటలను పండిస్తారు. గతంలో వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేసేవారు. పంటలకు సరిపడా వర్షాలు పడితే కానీ పంట చేతికి వచ్చేది కాదు. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు పంటలను నష్టపోవాల్సి వచ్చేది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం జిల్లాలోని రైతులకు సాగునీరు అందించడానికి పకడ్బందీ చర్యలు తీసుకుంది. ప్రాజెక్టులు, చెరువుల నిర్మాణాలను చేపట్టింది. సాత్నాల ప్రాజెక్టు ఆధునీకరణ పనులు చేపట్టడంతో చివరి ఆయకట్టుకు నీరు అందుతుంది. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా 208 చెరువులకు మరమ్మతులు చేపట్టగా, 45 వేల ఎకరాల ఆయకట్టు పెరిగింది. గత ప్రభుత్వాలు జిల్లాలో పుష్కలంగా నీటిని నిల్వచేసే అవకాశాలున్నా పట్టించుకోలేదు. దీంతో వానకాలంలో వర్షాలు పడినప్పుడు నీరంతా వృథాగా పోయేది. ఫలితంగా ఎండాకాలం ప్రారంభంలోనే భూగర్భజలాలు అడుగంటి సాగు, తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడేవారు. వర్షపు నీరు వృథాగా పోకుండా రైతులకు, స్థానికుల ఉపయోగపడడంతో పాటు పశువులకు తాగునీరు లభించేలా ప్రభుత్వం జిల్లాలో చెక్‌డ్యాంలను నిర్మించింది. జిల్లాలో మొదటి విడుతలో నిర్మించిన చెక్‌డ్యాంలు రైతులు, స్థానికులకు ఎంతగానో ఉపయోగపడుతుండడంతో అధికారులు మరో 60 చెక్‌డ్యాంల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపారు.

### 47 చెక్‌డ్యాంల నిర్మాణాలు

జిల్లాలో వానకాలంలో ఏటా 1400 మి.మీ వర్షాపాతం నమోదవుతుంది. ఎత్తైన ప్రాంతాలు, గుట్టలు, వాగులు, వంకల ద్వారా వర్షపు నీరు వృథాగా పోతోంది. 'పరిగెత్తే నీటికి నడక నేర్పు. నడిచే నీటికి నిలకడ నేర్పు' అనే నినాదంతో జిల్లాలో చెక్‌డ్యాం నిర్మాణాలను చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాకు మొదటి విడుతలో 47 చెక్‌డ్యాంలు మంజూరయ్యాయి. వర్షాకాలంలో నీటిని నిల్వచేసి రైతులకు ఉపయోగపడేలా చేపట్టిన చెక్‌డ్యాం నిర్మాణాలను నీటి పారుదలశాఖ అధికారులు పూర్తి చేశారు. ఆదిలాబాద్ సబ్‌డివిజన్‌లో 15, ఇచ్చోడ సబ్ డివిజన్‌లో 17, ఉట్నూర్ సబ్‌డివిజన్‌లో 15 చెక్‌డ్యాంలను నిర్మించారు. ఇందుకోసం రూ. 126.48 కోట్లను ఖర్చు చేశారు. వానకాలంలో కురిసిన వర్షాలతో చెక్‌డ్యాంలు నీటితో కళకళలాడుతున్నాయి. యాసంగిలో 8819 ఎకరాలకు వీటి ద్వారా సాగు నీరు అందనున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. చెక్‌డ్యాంల నీటిని రైతులు మోటార్ల ద్వారా నీటిని తీసుకుని స్ప్రింకర్ల ద్వారా పంటలకు అందిస్తున్నారు. సర్కారు అందించిన సాయంతో తాము రెండో పంటను సాగు సాగుచేసుకునే అవకాశం లభించిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెక్‌డ్యాంలో వల్ల భూగర్భ నీటి మట్టం పెరిగి ఎండాకాలంలో స్థానికులకు తాగునీటి సమస్య ఉండదు.

### రెండు పంటలకు సాగునీరు



నాకు ఐదెకరాల భూమి ఉంది. ఈ ఏడాది వానకాలంలో రెండెకరాల్లో పత్తి, మూడు ఎకరాల్లో సోయా పంటను వేశారు. సోయాకు చివరిదశ ఉండగా వర్షాలు లేకపోవడంతో గ్రామంలో నిర్మించిన చెక్‌డ్యాం ద్వారా నీటిని అందించాను. ఫలితంగా దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. సోయా పంట తీసివేసిన తర్వాత శనగ వేశాను. పంటకు చెక్‌డ్యాం నీటిని మోటార్ల ద్వారా అందిస్తున్నాం. ప్రభుత్వం మా గ్రామంలో చెక్‌డ్యాం నిర్మించడంతో రెండు పంటలకు సాగునీరు అందిస్తున్నాను.

**- గైక్వాడ్ మారుతి, రైతు, ముక్రా(కే) ఇచ్చోడ**

### చెక్‌డ్యాంతో యాసంగి సాగు



మా గ్రామంలో రైతులు ఇంతకు ముందు సాగునీటి సౌకర్యం లేక వర్షాలపై ఆధారపడి ఒకే పంటను సాగుచేసేవారు. మూడేళ్ల కిందట గ్రామంలో చెక్‌డ్యాం నిర్మించారు. దీంతో రెండు పంటలు వేస్తున్నారు. నేను వానకాలంలో సోయా పంటను వేశాను. పంట కు సరైన సమయంలో నీళ్ల ఇవ్వడంతో 16 క్వింటాళ్ల దిగుబ డి వచ్చింది. యాసంగిలో మూడు ఎకరాల్లో శనగ పంటను వేశాను. చెక్‌డ్యాం నీటిని పంటకు అందిస్తున్నాను.

**-నమవాడే శంకర్. రైతు, ముక్రా(కే), ఇచ్చోడ మండలం**




ఆదిలాబాద్‌లోని నియోనెటల్ కేర్ అంబులెన్స్

# శిశువులకు అంబులెన్స్

- అందుబాటులో ప్రత్యేక వాహనాలు
- పలు రకాల సౌకర్యాలు
- దూర ప్రాంతాలకు సురక్షితంగా తీసుకెళ్లే అవకాశం

**పేదల వైద్యం కోసం ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నది. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యాన్ని సంరక్షించడానికి పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నది. ఆరోగ్యలక్ష్మి, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ లాంటి పథకాలు తల్లి, శిశువుల కోసం ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. నవజాత శిశువులకు మరింత రక్షణ కల్పించడానికి నియోనెటల్ కేర్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. పుట్టుకతోనే పలు ఆరోగ్య సమస్యలతో బాధపడే శిశువులను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని దవాఖానలకు తరలించడానికి ఈ అంబులెన్స్‌ను వినియోగిస్తారు. వీటిలో శిశువు చికిత్సకు అవసరమైన సౌకర్యాలు ఉంటాయి.**

**-ఆదిలాబాద్, నవంబరు 3 (నమస్తే తెలంగాణ)**



అంబులెన్స్‌లోని పరికరాలు

పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, తల్లీబిడ్డల సంరక్షణకు పలు పథకాలను అమలు చేస్తున్నది. ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగంగా గర్భిణీలు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నది. ప్రభుత్వాసుపత్రుల్లో గర్భిణులకు అవసరమైన స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తూ మందులు పంపిణీ చేస్తున్నారు. పేద కుటుంబాలకు చెందిన గర్భిణులు పౌష్టికాహారం లభించక రక్తహీనతతో బాధపడుతున్నారు. వీరు డెలివరీ సమయంలో పలు సమస్యలు వస్తుండడంతో పాటు తల్లీబిడ్డల అనారోగ్యం బారిన పడి మరణాలు సంభవిస్తున్నాయి. ఈ సమస్య నివారణకు ప్రభుత్వం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌ల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తూ వారిలో రక్తహీనత సమస్యను నివారిస్తుంది. దీంతో పాటు ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవం అయిన వారికి కేసీఆర్ కిట్‌లను అందజేస్తున్నది. వీటిల్లో తల్లీబిడ్డలకు అవసరమైన వస్తువులు ఉంటాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలితంగా సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. జిల్లా దవాఖానలతో పాటు గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం డెలీవరీలు జరుగుతున్నాయి. జిల్లాలో సర్కారు దవాఖానల్లో 70 శాతానికి పైగా ప్రసవాలు జరుగుతున్నట్లు వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు.

### శిశువులకు వరంగా నియోనెటల్ కేర్ అంబులెన్స్‌లు

ప్రభుత్వం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్‌ను ప్రారంభించి శిశువులకు చికిత్సలు అందిస్తుంది. దవాఖానలో నవజాత శిశువులకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధిష్ట ప్రమాణాల మేరకు మేరుగైన సేవలు అందుతుండడంతో ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వ జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ రిమ్స్‌కు ముస్కాన్ అవార్డును ప్రకటించింది. అప్పుడు పుట్టిన శిశువులకు తీవ్రమైన ఆరోగ్యపరమైన సమస్యలు ఉంటే మెరుగైన వైద్యం కోసం గ్రామీణ ప్రాంతాల్లోని శిశువులను రిమ్స్‌కు, అక్కడి నుంచి అవసరమైన వారిని హైదరాబాద్ దవాఖానలకు తరలించాల్సి వస్తుంది. శిశువులకు ఎలాంటి అపాయం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వం నియోనెటర్ కేర్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటిలో ఆక్సిజన్ సౌకర్యంతో పాట శిశువులకు శ్వాస అందించడానికి వెంటిలేటర్, హైపోథెర్మియాకు గురైతే రేడియంట్ వార్మర్, పల్స్, రక్తంలో ఆక్సిజన్, హార్ట్‌బీట్ పరీక్షించడానికి మల్టీ ఛానల్ మానిటర్, పల్స్ ఆగిపోతే షాక్ ఇచ్చి పునరుద్ధరించడానికి నియోనెటల్ ఆటో మేటెడ్ ఎక్సరనల్ డిఫిబ్రిలేటర్, సెలైన్ ఎక్కించడానికి ఇన్‌ఫ్యూజన్ పంపు లాంటి సౌకర్యాలు ఉంటాయి. రిమ్స్‌లో ఈ అంబులెన్స్ సేవలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

### చిన్నారుల ఆరోగ్యానికి రక్షణ



ప్రభుత్వం చిన్నారుల వైద్యసేవల కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన నియోనేటల్ కేర్ అంబులెన్స్‌లు ఎంతో ప్రయోజనం ఉంటుంది. చిన్నారులను వైద్యం కోసం హైదరాబాద్ లాంటి చోటుకు తీసుకుపోవడానికి ఈ అంబులెన్స్‌లు ఉపయోగపడుతాయి. అంబులెన్స్ సిబ్బంది వీటిలో శిశువు చికిత్సకు అవసరమైన సౌకర్యాలు ఉండడంతో వారు ప్రాథమిక చికిత్స అందించే వీలుంటుంది.

**- విశ్వసేన, ఆదిలాబాద్**

### అన్ని రకాల సౌకర్యాలు



నియోనేటల్ కేర్ అంబులెన్స్‌లో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయి. ఆక్సిజన్ సౌకర్యంతో పాట శిశువులకు శ్వాస అందించడానికి వెంటిలేటర్, సైలెన్ పెట్టడానికి పరికరాలు ఉన్నాయి. శిశువులు అనారోగ్యానికి గురైతే దవాఖానలకు తీసుకుపోవడానికి సమయం పడుతుంది. దీంతో కొన్ని ఇబ్బందులు వస్తాయి. ఈ అంబులెన్స్ అందుబాటులోకి రావడంతో సత్వరమే వైద్యసేవలు అందుతాయి.

**-వసీం, ఆదిలాబాద్**